

పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర

పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. కూటమి ప్రభుత్వం కార్పొరేట్‌కు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటోంది. గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చింది. ఇప్పటికే ఐదు కళాశాలలను అందుబాటులోకి తెచ్చింది. మిగిలినవి నిర్మాణదశలో ఉన్నాయి. ఎలాంటి సౌకర్యాలు లేవని మెడికల్ కళాశాలలను రద్దు చేయాలని లేఖలు రాయడం కూటమి ప్రభుత్వ కుటిల రాజకీయానికి నిదర్శనం.

– హనుమంతరాయుడు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



వైద్య విద్య ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి..

ప్రభుత్వం వైద్య విద్య ప్రైవేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తామనడం ముమ్మాటికీ వైద్య విద్యను పేదలకు దూరం చేసేందుకు జరుగుతున్న కుట్ర. తెలుగు రాష్ట్రాల్లో అనేక మంది పేద విద్యార్థులు డాక్టర్లు కావాలనే ఆశయం, లక్ష్యాలను నీరు గారుస్తున్నారు. గత ప్రభుత్వం సిద్ధం చేసిన మెడికల్ కళాశాలల్లో యుద్ధప్రాతిపదిన సీట్లు భర్తీకి చర్యలు చేపట్టాలి.

– ఎస్.పార్వతి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఏపీ మహిళా సమాఖ్య, కార్యదర్శి, రాయదుర్గం



క్లుప్తంగా

పురాతన ప్రభుత్వ భవనాల పరిశీలన



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు రూం పరిశీలిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బ్రిటీష్ కాలం నాటి ప్రభుత్వ భవనాలను రాష్ట్ర ప్రభుత్వ ఆర్కిటెక్చర్ నవీన్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో వందేళ్ల నాటి వీఆర్ఓల కార్యాలయంతో పాటు రెవెన్యూ రికార్డులు భద్రపరిచిన కార్యాలయాన్ని పరిశీలించారు. ఆర్కిటెక్చర్ మాట్లాడుతూ పురాతన భవనాలు చిన్న మరమ్మతులు చేస్తే అవే మరో 50 ఏళ్ల కూడా చెక్కు చెదరవని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కళ్యాణదుర్గం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్ తెలిపారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా మురుగునీటి కాలువల్లో చెత్తా చెదారంతో పాటు ప్లాస్టిక్ వేయడాన్ని నిషేధించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ అలీ ఖాన్, హెల్త్ సెక్రటరీ తిప్పేస్వామి, నార్త్ హై స్కూల్ పీడీ కిరణ్, శానిటేషన్ సెక్రటరీలు గణేష్, శ్రీకాంత్, నవీన్, వలి, రాజు, సతీష్, లక్ష్మీనారాయణ, మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం



మిలాదే ముస్తాఫా కాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తున్న సయ్యద్ నూర్ మియా అష్రాఫీ

ఉరవకొండ: మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయమని, ఆయన మానవీయతకు ప్రతిరూపమని ప్రముఖ ప్రసంగీకులు సయ్యద్ నూర్ మియా అష్రాఫీ తెలిపారు. గురువారం స్థానిక సయ్యద్ జమాలుద్దీన్ ఖాద్రీ దర్గా ఆవరణలో జిల్లా స్థాయి మిలాదే ముస్తఫా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉరవకొండకు చెందిన సయ్యద్‌షా అజ్మతుల్లా హుసేనీ, సయ్యద్‌షా ఖుతుబుద్దీన్ మహమ్మద్ ఖాద్రీ తఖీబాబా, సయ్యద్‌షా షకీబ్ అహ్మద్, జామియా తాసీరియా ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ హజరత్ సయ్యద్‌షా జమాలుద్దీన్ తాసీర్ హుసేనీ ఉల్ ఖాద్రీల ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పౌష్టికాహార మాసోత్సవాల్లో పాల్గొన్న సీడీపీఓ పద్మావతి

గుమ్మఘట్ట: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి తెలిపారు. మండలంలోని తాళ్లకెరలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రక్తహీనత వున్న వారు ఐరన్ మాత్రలను తీసుకోవాలన్నారు. అనంతరం 15 మంది గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంజినమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరిబాధ్యత

బ్రహ్మసముద్రం: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని కళ్యాణదుర్గం సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. గురువారం బ్రహ్మసముద్రం మండలంలోని ఎరిడికెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌డీటీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికలను రక్షిద్దాం, బాలికలను చదవనిద్దాం అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డీటీ టీం లీడర్ ఆదినారాయణ, సర్పంచ్ అంజినమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్లు, ఐసీడీసీ సూపర్ వైజర్లు పాఠశాల, సచివాలయం, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు జాన్సన్ బాబు, శివారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ నిధులు మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

నీటి సంరక్షణలో నిర్లక్ష్యం

- జీటీపీ ప్రాజెక్ట్ నుంచి వృథా అవుతున్న సాగునీరు
- ఎడమ కాలువ హెడ్‌స్లూయిస్ కింద కొనసాగుతున్న లీకేజీ
- 4, 7 ప్రధాన గేట్ల కింద రబ్బర్‌సీల్ డ్యామేజీ
- లీకేజీ అరికట్టకపోతే దిగజారనున్న నీటిమట్టం

రాయదుర్గం: ప్రాజెక్టుల నిర్వహణపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. చిన్న మరమ్మతులు చేయించేందుకు కూడా నిధులు విడుదల చేయలేదు. ఇటీవల తుంగభద్ర డ్యాం 19వ ప్రధాన క్రస్ట్ గేట్ కొట్టుకుపోవడం కాస్త ఆందోళన కలిగించింది. అదేతరహా జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టుల్లో ఒకటైన భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్ట్ నిర్వహణ గాలికొదిలేయడంతో లీకేజీలు పెరిగి చి'వరి'కి సాగునీటి సందిగ్ధత ఏర్పడే ప్రమాదం ఉంది. ప్రధాన ఎడమ కాలువ హెడ్‌స్లూయిస్ కింద సాగునీరు వృథా అవుతోంది. 4, 7 ప్రధాన గేట్ల అడుగున రబ్బర్‌సీల్ దెబ్బతిని లీకేజీలు కనిపిస్తున్నాయి. నీటి వృథాను అరికట్టకపోతే ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్ట్ సముద్ర మట్టానికి 1,655 అడుగులు.1954లో వేదావతి నదిపై రూ.1.5 కోట్లతో 2.5 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్ట్ నిర్మాణం మొదలుపెట్టి, 1961లో పనులు పూర్తి చేశారు. క్రమేణా రిజర్వాయర్‌లో పూడిక చేరడంతో రెండు 2 టీఎంసీల మట్టానికి పడిపోయింది. ఈ నీటిని రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని గుమ్మఘట్ట మండలం (ఎడమకాలువ) 8,400, బ్రహ్మసముద్రం మండలం (కుడికాలువ) ద్వారా 4,200ల ఎకరాల ఆయకట్టుకు రొటేషన్ పద్ధతిలో సాగునీరు వినియోగిస్తున్నారు. 1980 వరకు ఖరీఫ్, రబీ రెండు పంటలకు నీరిచ్చారు. ఆ తర్వాత క్యాచ్‌మెంట్ ఏరియాలో కర్ణాటక ప్రభుత్వం వేదావతికి అడ్డంగా ఇష్టారాజ్యంగా బ్యారేజీలు నెలకొల్పడం, వర్షాభావ పరిస్థితులు వెంటాడడం లాంటి కారణాలు వెరసి నాలుగైదేళ్లకు ఒకసారి నిండే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతినీటి బొట్టూ రైతుకు విలువైంది. నీటిని సంరక్షించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు 1647.3 అడుగులకు వరదనీరు వచ్చిచేరింది. లీకేజీలతో ఇప్పటికే 3 ఇంచుల నీరు వృథా అయ్యింది. ప్రస్తుతం 1647 అడుగులకు నీరు నిల్వ చేరింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే నీటి మట్టం మరింత తగ్గే ప్రమాదం కనిపిస్తోంది.

కేవీట్యాంకుకు వెళ్లకుండా చౌర్యం

కాలువ ద్వారా ఆయకట్టుకు నీటిని మళ్లించాలంటే ముందు గుమ్మఘట్ట సమీపానున్న (కేవీట్యాంక్) చెరువు నింపాలి. ప్రస్తుతం ఎడమ హెడ్‌స్లూయిస్ కింద నిత్యం లీకేజీ అవుతున్న సాగునీరు ట్యాంకులోకి కాకుండా మధ్యలోనే కొందరు చౌర్యం చేస్తున్నారు. దీనిపై ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నీటిచౌర్యం ఎక్కువైనట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న నీటిని రొటేషన్ పద్ధతిలో రబీలో ఎక్కడిదాక వినియోగించొచ్చనే అంచనాకు వచ్చి కాలువల మరమ్మతులపై దృష్టిసారించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



ప్రధాన ఎడమ కాలువ ద్వారా వృథ అవుతున్న సాగునీరు

ప్రతిపాదనలు పంపాం

ప్రధాన ఎడమ కాలువ (హెడ్‌స్లూయిస్) అడుగుబాగన నీటి లీకేజీ కనిపిస్తోంది. దీని వల్ల పెద్ద ప్రమాదం ఉండదు. అయినా వృథానీరు కేవీ ట్యాంకులోకి మళ్లించేలా చర్యలు చేపట్టాం. పూర్తి స్థాయి నీరుచేరితే ఆయకట్టు రైతులతో సమావేశం ఏర్పాటుచేసి, ఎక్కడిదాక నీరివ్వాలో చర్చిస్తాం. గేట్ల వద్ద నీటి లీకేజీ గుర్తిస్తాం. ప్రాజెక్టు వద్ద ఇలాంటి మరమ్మతులపై ప్రతిపాదనలు పంపాం. టెక్నికల్ అప్రోవల్ వస్తే ఎస్టిమేట్లు తయారుచేసి నీటివృథాను శాశ్వతంగా అరికడతాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తాత్కాలికంగా లీకేజీ అరికట్టేలా కృషిచేస్తాం. సాగునీటికి ఎలాంటిడోకా లేకుండా చూస్తాం. ఇంజనీర్ల పర్యవేక్షణ పెంచేలా కృషి చేస్తాం.

– బలరాముడు, ఇరిగేషన్ డీఈ, రాయదుర్గం

బీటీపీకి నీరు ఎప్పుడిస్తారో చెప్పాలి



సాధారణ ఎన్నికలకు ముందు బాబుష్యూరిటీ .. భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో రాయదుర్గం పర్యటనకు వచ్చిన అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు అనేక హామీలు గుప్పించారు. పాలన ప్రారంభమై వందరోజులు దాటినా ఎలాంటి కార్యాచరణ చేపట్టలేకపోయారు. ప్రధానంగా బీటీ ప్రాజెక్టుకు సాగు నీరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభిస్తారోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు నేటికీ ముందడుగు పడలేదు. ఉంతకల్లు రిజర్వాయర్‌కు నీరిస్తామన్నారు. ఈ హామీలు నెరవేర్చేలా చర్యలుచేపట్టాలి. లేదా ఎప్పటిలోగా పూర్తిచేస్తారో రైతులకు చెపితే బాగుంటుంది.

– గౌని ఉపేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతువిభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి, రాయదుర్గం

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

- వీధిదీపాల సమస్యపై కౌన్సిలర్ల నిలదీత

రాయదుర్గంటౌన్: వార్డుల్లో వీధి దీపాల కొరతపై కౌన్సిల్ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. టెండర్లు పిలవడమే పరిపాటిగా పెట్టుకున్నారని, సమస్య పరిష్కారం కావడం లేదు. వీధిదీపాలు లేక అనేక కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు కౌన్సిలర్లు బండి అజయ్, పొరాళ్ల గోవిందరాజులు, పద్మజ, శ్రీనివాసరెడ్డి అధికారులను నిలదీశారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత కౌన్సిల్ అజెండాలోని అంశాలను సిబ్బంది చదివి వినిపించారు. అజెండాలో వీధి దీపాల అంశంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సకాలంలో వీధి దీపాలు కొనుగోలు చేసి, సమస్య తీర్చడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. కూరగాయల షాపింగ్ కాంప్లెక్స్‌లోని 50 రూముల లీజు గడువు ముగిసిందని, రెన్యూవల్ కోసం కౌన్సిల్ ముందుకు తెచ్చిన అంశంపై కౌన్సిలర్లు డిష్ గోవిందు, బండి అజయ్, పొరాళ్ల గోవిందరాజులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జేఆర్ఎస్ కాలనీలోని పాఠశాల అదనపు భవనం లీజు కాంట్రాక్ట్ గడువు ముగిసినందున రెన్యూవల్ చేయరాదని, వాయిదా వేయాలని కౌన్సిలర్ ప్రశాంతి అభ్యంతరం తెలపడంతో వాయిదా వేసేందుకు కమిషనర్ ప్రయత్నించడంతో కొందరు కౌన్సిలర్లు ప్రశ్నించారు. పశువుల సంచారం, కుక్కల బెడదను నివారించాలని కౌన్సిలర్ గోవిందరాజులు సమావేశం దృష్టికి తెచ్చారు. అనంతరం అజెండాలోని అంశాలను కౌన్సిల్ ఆమోదించారు.

ఆక్రమణదారులపై చర్యలకు డిమాండ్

ఒకటో వార్డు వైఎస్సార్ విగ్రహం వెనుక రెవెన్యూ రిజర్వు స్థలాన్ని పడగొట్టడమేకాక ఇటీవల కల్వర్టు నిర్మించిన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ భీమనపల్లి నాగవేణి డిమాండ్ చేశారు. ఆక్రమణపై కలెక్టర్ సైతం ఫిర్యాదు చేశారని, క్షేత్రస్థాయిలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు విచారించాలన్నారు. ప్రభుత్వ రిజర్వు స్థలం ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు.

కౌన్సిల్ సహకరిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం..

పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను కౌన్సిల్ సభ్యులు సహకరిస్తే పరిష్కరిస్తామని అర్బన్ సీఐ జయనాయక్ తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, జెడ్పీ బాలికల హైస్కూల్, ఏరియా ఆస్పత్రి, వినాయక సర్కిల్, గాంధీ సర్కిల్ వద్ద సమస్య అధికంగా ఉందన్నారు. ప్రధానంగా రోడ్లపై ఆక్రమించుకుని చిరు వ్యాపారాలు, ప్రధాన రహదారిపై రాత్రి 12 గంటల నుంచి కూరగాయల హోల్‌సేల్ వ్యాపారం, ఆస్పత్రి, పాఠశాల వద్ద ఆక్రమణలతో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు శ్రీనివాసయాదవ్, వలిబాషా తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ సురేష్, డిప్యూటీ తహసీల్దార్ రఘు, టీపీఓ మారుతీప్రసాద్, ఆర్ఓ కొండన్న, టీపీఆర్ఓ సుబ్బరాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



వీధిదీపాల కొరతపై అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేద్దాం

రాయదుర్గం: రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా కలసికట్టుగా పనిచేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి సూచించారు. గురువారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిల్ బృందం, వార్డు ఇన్‌చార్జులు, పార్టీ ముఖ్య నాయకులతో కలిసి వెళ్లి జిల్లా అధ్యక్షుడు అనంతకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంత స్వగృహంలోనే మెట్టు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి వందరోజులు పూర్తవుతున్నా సూపర్‌సిక్స్ హామీల్లో ఎలాంటి పురోగతీ లేదన్నారు. జగనన్న ప్రభుత్వం ఉండి ఉంటే ఇప్పటికే అమ్మఒడి, రైతుభరోసా, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీవిద్య, తోడు, చేదోడు లాంటి అనేక పథకాలు పేదలకు అందేవన్నారు. అధికారంలోకి రాగానే పథకాలన్నీ పక్కాగా అమలు చేస్తానని చెప్పిన చంద్రబాబు..కారణాలు వెతుక్కుంటున్నారని ధ్వజమెత్తారు. వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఏదో ఘన కార్యం సాధించినట్లు ఎమ్మెల్యేలు ఈ ఐదు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లే కార్యక్రమనికి శ్రీకారం చుట్టారన్నారు. అన్నదాత సుఖీభవ ఎక్కడ? పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఏమైంది? ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికీ తల్లికి వందనం ఎప్పుడు ఇస్తారు? రూ.3వేల నిరుద్యోగభృతిపై మీ మాటేంటి? ప్రతి మహిళకూ రూ.1500, ఉచిత బస్సు లాంటి హామీలపై ప్రజలు నిలదీసేందుకు సిద్ధపడ్డారన్నారు. త్వరలో నియోజకవర్గ స్థాయిలోనే కార్యకర్తలు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. టీడీపీ గుండాల దాడులు, దౌర్జన్యాలను కలసికట్టుగా అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షుడు అనంతకు మెట్టుతో కలసి శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ పాలక పక్షం

క్రీడలతో మానసికోల్లాసం

బొమ్మనహాళ్: క్రీడలతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతుందని ఎంఈఓలు మల్లికార్జున, వీరన్న తెలిపారు. గురువారం గోవిందవాడ ఉన్నత పాఠశాలలో స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ మండల స్థాయి క్రీడలు ప్రారంభమయ్యాయి. అండర్-14, అండర్-17 విద్యార్థినీ విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, పరుగు పందెం పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజ సూర్యుడు, క్రీడాల కోఆర్డినేటర్ భోగేష్, వ్యాయామ ఉపాధ్యాయులు హలీమా, కృష్ణ, జనార్ధన, శివ, బొజ్జప్ప, మహమ్మద్ పీర్, రాజేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పోడియం పాయె..టేబుల్ వచ్చె



పోడియం ఎత్తు తగ్గించి సాధారణ కుర్చీలో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు

రాయదుర్గంటౌన్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం పోయి.. టేబుల్ వచ్చింది. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ సాధారణ ఫ్లోరింగ్‌పై సాధారణ కుర్చీలో కూర్చొని విధులు నిర్వర్తిస్తున్నారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించే దిశలో భాగంగా చర్యలు తీసుకున్నారు. గతంలో సబ్ రిజిస్ట్రార్ పోడియం అడుగు ఎత్తుపైన ఉండేది. ప్రస్తుతం కట్టను తొలగించి ఫ్లోర్ మొత్తం లెవల్ చేయించారు. సాధారణ టేబుల్, కుర్చీని ఏర్పాటు చేసి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు విధులు నిర్వర్తించడం కనిపించింది.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: స్థానిక ప్రాథమిక పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు రాజేష్,స్వర్ణలత తదితరులను గురువారం సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. సమాజంలో ఉ పాధ్యాయ వృత్తికి ప్రత్యేక గౌరవం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు మోనాలిసా, ఎంఈఓఎర్రిస్వామి, హెచ్‌ఎంలు రంగప్రసాద్, నాగేంద్ర ప్ప, వేణుగోపాల్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ శాంతప్ప, ఉపాధ్యాయ సంఘం నాయకులు ధనుంజయ, రామప్ప, ఇమామ్ పాల్గొన్నారు.

పురాతన ఆలయాలు పరిశీలన



ఉద్దేహాళ్‌లో పురాతన ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: మండలంలోని పురాతన ఆలయాలను దేవదాయశాఖ అధికారులు గురువారం పరిశీలించారు. దేవదాయ శాఖ కర్నూల్ అసిస్టెంట్ స్థపతి సుబ్రమణ్యం, అనంతపురం ఈవో బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ హరిత, టెక్నికల్ అసిస్టెంట్ మహేంద్ర పరిశీలించారు. మండలంలోని దర్గాహొన్నూరులో మల్లికార్జున స్వామి ఆలయం, సింగానహళ్లిలో వేదావతి హగరి నది ఒడ్డున వెలసిన సంగమేశ్వర స్వామి ఆలయం, ఉద్దేహాళ్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయాలను పరిశీలించారు.

గుండెపోటుతో ఎమ్మార్పీఎస్ నాయకుడు మృతి

రాయదుర్గం: మండలంలోని రాయంపల్లికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు విరుపా శ్రీనివాసులు (48) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం

రాయదుర్గంటౌన్: పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని డాక్టర్ రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యకలాపాలపై 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పరీక్షలను చైర్‌పర్సన్ శిల్పతోపాటు కమిషనర్ దివాకర్‌రెడ్డి, హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులు రామేశ్వర్‌రెడ్డి కలిసి పరిశీలించారు.

నేడు ఆలయ హుండీ కానుకల లెక్కింపు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలోని అక్కమ్మగార్ల ఆలయ హుండీ కానుకలు శుక్రవారం లెక్కించనున్నారు. ఆలయ కమిటీ, దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఒంటిమిద్ది, దేవాదులకొండ, కురాకులతోట గ్రామ ప్రజల సమక్షంలో లెక్కించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బత్తిని రాము గురువారం తెలిపారు.

ఉచిత వైద్య పరీక్షలు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు గురువారం గుండె వైద్య శిబిరం నిర్వహించారు. అంబేడ్కర్ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని తహసీల్దార్ మునివేలు, ఈఓపీఆర్‌డీ దాస్ ప్రారంభించారు. వైద్యులు నాగరాజు, రాఘవేంద్ర దాదాపు

సంక్షిప్త సమాచారం

145 మందికి షుగర్ పరీక్షలు, బీపీ రక్తపరీక్ష, గుండె పరీక్షలు పరీక్షలు చేశారు.

70 మద్యం ప్యాకెట్ల పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని జె.వెంకటంపల్లికి చెందిన బోయ ధనుంజయ్య నుంచి 70 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య గురువారం తెలిపారు.

రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుద్దాం

గుమ్మఘట్ట: రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్పు చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సురేశ్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత, మండల ఇంజనీర్ లక్ష్మీనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ, పశువైద్యాధికారి నవీన్‌కుమార్, ఏపీఎం కళానాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

27న పీఏసీఎస్ సహకార సంఘం మహాసభ

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని భైరవానితిప్ప పీఏసీఎస్ సహకార సంఘం మహా సభ నిర్వహిస్తున్నట్లు సహకార సంఘం కమిటీ సభ్యులు తీర్మానించారు. సహకార సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 27న నిర్వహించనున్న మహాసభకు కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని సహకార సంఘం పీఏసీ ఆఫీసర్ మారుతీ, సిబ్బంది తెలిపారు.

24 లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి

కూడేరు: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు పంటల నమోదు, ఈ-కేవైసీ చేయించుకోవడానికి ఈ నెల 24 ఆఖరి తేదీ అని ఏఓ విజయకుమార్ గురువారం తెలిపారు. ఇంకా పంటల నమోదు చేయించుకోని రైతులు వెంటనే చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఈ-కేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచించారు.

యువత మానసికంగా ధృడంగా ఉండాలి

కళ్యాణదుర్గం రూరల్: యువత మానసికంగా ధృడంగా ఉండాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ గరుగు బాలాజీ విద్యార్థులకు సూచించారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 3వ రోజు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నెహ్రూ యువ కేంద్ర అనంతపురం ప్రగతి పదం యూత్ అసోసియేషన్, ఎస్ ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడిని యువత ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయరాం రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు శ్రీధర్, రవిశంకర్, ఉపాధ్యాయులు సౌకత్ అలీ, చాముండేశ్వరి, సుధాకర్, రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యం మెరుగుపడాలి

కూడేరు: పిల్లల్లో విద్యా సామర్థ్యం మెరుగుపడే విధంగా బోధన ఉండాలని మండల విద్యాధికారి-2 సాయికృష్ణ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం కూడేరులోని హైస్కూల్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఎంఈఓ-2 సాయికృష్ణ సమావేశాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సాంకేతికతను అందిపుచ్చుకుని పిల్లలకు క్రమ శిక్షణతో కూడిన విద్యా బోధన చేయాలని సూచించారు. ట్రైనర్లు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాహుల్ అంటే బీజేపీకి భయం

కళ్యాణదుర్గం: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అంటే బీజేపీకి భయం పుట్టుకుందని ఆ పార్టీ పీసీసీ సభ్యుడు రాంభూపాల్ రెడ్డి, నాయకులు అన్నారు. రాహుల్‌ను చంపాలని బీజేపీ, శివసేన నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కళ్యాణదుర్గంలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు తిమ్మప్ప, సీనియర్ నాయకులు మాల ఎర్రిస్వామి, గోవిందప్ప, మల్లయ్య, కృష్ణమూర్తి, కరీం సాబ్, తిప్పేస్వామి, బలరాంరెడ్డి, బొజ్జప్ప, గోవిందప్ప పాల్గొన్నారు.

సమ్మెలోకి వెళ్లిన పీహెచ్‌సీ వైద్యులు

కూడేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఇద్దరు సమ్మెలోకి వెళ్లారు.దీంతో రోగులకు వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17 నుంచి వైద్యులు జిల్లా యూనియన్ ఆదేశాల మేరకు సమ్మెలోకి వెళ్లారు. పీహెచ్‌సీ పరిధిలో 27 గ్రామాలు ఉన్నాయి. వైద్యం కోసం ఆయా గ్రామాల నుంచి రోజుకు సుమారు 80-100 మంది దాగా వైద్యం కోసం వస్తుంటారు. వైద్యులు లేకపోవడంతో స్టాఫ్ నర్సులే వైద్య సేవలందిస్తున్నారు.

సోలార్ విద్యుత్ సబ్సిడీలు వినియోగించుకోండి

కళ్యాణదుర్గం రూరల్: కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ పథకంలో అందిస్తున్న సోలార్ విద్యుత్‌ను ప్రజలు వినియోగించుకోవాలని డీఈ శేషాద్రి శేఖర్ తెలిపారు. గురువారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో పీఎం సూర్య ఘర్ (గృహావసర నిమిత్తం సోలార్ విద్యుత్ ప్యానల్స్) అంశంపై అవగాహన కల్పించారు. డీఈ శేషాద్రి శేఖర్ మాట్లాడుతూ సబ్సిడీలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సోలార్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఏడీ గురురాజ్, రూరల్ ఏడి శ్రీనివాసులు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈ శేషాద్రి శేఖర్